సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో పెరుగుతున్న నేరాలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చే విషయంలో సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. గతంలో హత్య కేసుల్లో శిక్షలు 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' సిద్ధాంతం ఆధారంగా ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు.

'క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి'..

'సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్?ను పెంచాలి : సుప్రీంకోర్టు

మరోవైపు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో నేరాలను గుర్తించ డం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని ఢిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది.

'గుండాల గుండెల్లో వణుకు పుట్టాలి'..

కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవలే దేశ అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ముఖ్యంగా ఢిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని పేర్కొంది. ఢిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్ప డకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఢిల్లీ పోలీసులను కోరింది. మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తులను నిరోధించడానికి ఢిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీస్ వ్యూహం అవసరమని స్పష్టం చేసింది. దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని చెప్పింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని, నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని సూచించింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ.. మూడేళ్ల చిన్నారి దుర్మరణం

విశ్వంభర, ఖమ్మం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో మూడేళ్ల చిన్నారి లారీ కిందపడి మృతి చెందిన ఘటన ఖమ్మం నగరం ఎన్టీఆర్ సర్కిల్‌లో గురువారం రాత్రి జరిగింది. ఖమ్మం రెండో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన జట్టి అశోక్, సంధ్య ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి వారి ఇంటికి వెళ్తున్నారు. ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సిగ్నల్ వద్ద ఆగారు. తిరిగి కదిలే సమయంలో వారి ద్విచక్ర వాహనాన్ని వెనుకనే ఉన్న లారీ ఢీకొట్టింది. దీంతో తల్లి ఒడిలో ఉన్న మూడేళ్ల నిషిత రోడ్డుపై జారిపడింది. చిన్నారిపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

అది ఫేక్ ఫొటో.. నమ్మొద్దు : సీపీ సజ్జనార్

విశ్వంభర, హైదరాబాద్: సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ ఫొటో అని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ అభిమానులు కొందరు తన ఫొటోను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ సినీనటుడు ఎన్టీఆర్‌కు చెందిన సోషల్ మీడియా ఖాతాను ట్యాగ్‌చేశారు. "అది ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఫొటో. దయ చేసి నెటిజన్లు ఇలాంటి డీప్‌ఫేక్ వలలో పడకండి. వాటిలో నిజానిజాలు తెలుసుకోకుండా షేర్ చేయొద్దు. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలు రోజు రోజుకీ మరింత వాస్తవికంగా కనిపిస్తున్నందున.. ఆన్‌లైన్‌లో చూసేవాటి వెనుక వాస్తవాలు తెలుసుకోవడం ముఖ్యం. ఏదైనా ఫొటో నమ్మశక్యంగా కనిపించినంత మాత్రాన అది నిజమైంది కాదు. ప్రజలు వాస్తవాలను సరి చూసుకోకుండా కంటెంట్‌ను షేర్ చేసినప్పుడు తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతుంది" అని సజ్జనార్ పోస్టు చేశారు.'దేవర' చిత్రంలోని "చుట్టమల్లే..." పాటను ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన నిందితులను సీపీ సజ్జనార్ అరెస్ట్ చేశారంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో సీపీ సజ్జనార్ స్పందించి.. అది ఫేక్ ఫొటో అని క్లారిటీ ఇచ్చారు.

ఇండీ కూటమి ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్.. పలువురు మంత్రుల అరెస్టు

విశ్వంభర, హైదరాబాద్: సర్ ప్రక్రియలో అవకతవకలకు నిరసనగా ఇండీ కూటమి ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సేవ్ డెమోక్రసీ పేరుతో భారీ నిరసన చేపట్టారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. భారీ ఎత్తున కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు తరలి వచ్చాయి. నిరసన ప్రదర్శన ప్రారంభమైన కొద్దిసేపటికే పోలీసులు జోక్యం చేసుకొని ర్యాలీని అడ్డుకున్నారు. నిరసనలో పాల్గొన్న మంత్రులు, పలువురు నేతలను అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆస్తి వివరాలు సమర్పిస్తేనే పదోన్నతి: తమిళనాడు ప్రభుత్వం

విశ్వంభర, చెన్నై: నిర్ణీత కాలపరిమితిలోపు ఆస్తి విలువ వివరాలను సమర్పించే ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు మాత్రమే పదోన్నతి జాబితాలో ఉంటాయని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సాయికుమార్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ స్థిరాస్తి, చరాస్తులు, పొదుపు, అప్పులు వంటి అన్ని వివరాలను ఈనెల 31వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వ 'ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ఇతరుల పేరుతో ఆస్తులు కొనుగోలు చేసిన వివరాలూ వెల్లడించాలని, ఆ వ్యక్తితో ఉన్న బంధాన్ని తెలియజేయాలన్నారు. ఆస్తి వివరాలు సమర్పించని ప్రభుత్వ ఉద్యోగులను సత్ప్రవర్తన నిబంధనలను అతిక్రమించినట్లు పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిలో డీఎంకే ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో చేసిన సవరణ ఆధారంగా తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఐఫోన్ కాజేసి.. పైగా పాస్‌వర్డ్ చెప్పమంటూ మెసేజ్‌లు!

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఐఫోన్‌ను కాజేయడమే కాకుండా.. ఆ ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలంటూ అందులోని ఎమర్జెన్సీ కాంటాక్ట్ నంబర్‌కు సందేశాలు పంపాడో దొంగ. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసింది. దీనికి సంబంధించి కౌశికీ ధ్యానీ అనే యువతి సోషల్ మీడియాలో పెట్టిన వీడియో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. "ఇంటి నుంచే ఇటీవల నా సోదరుడి ఐఫోన్ మాయమైంది. సీసీకెమెరా ఫుటేజీని పరిశీలిస్తే.. ఆ సమయంలో గది తలుపులు తెరిచి ఉండగా, ఇద్దరు అనుమానాస్పద వ్యక్తుల కదలికలు రికార్డ య్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అప్పటికే ఆ ఫోన్‌లో ఎమర్జెన్సీ కాంటాక్ట్‌గా నా నంబర్ ఉండటంతో.. ఐఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలంటూ నాకు టెక్స్ట్, వాట్సాప్ మెసేజ్‌లు వస్తున్నాయి. సీసీటీవీ ఫుటేజీలు, నిందితుడి ఫొటోలు, నాకు పంపిన సందేశాల స్క్రీన్‌షాట్‌ల వంటి ఆధారాలన్నీ పోలీసులకు అందజేశాం. అయినప్పటికీ.. వారు సరిగ్గా స్పందించడం లేదు" అని ఆమె ఆరోపించారు. మరోవైపు..ఆ ఫోన్‌ను ట్రేస్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు

బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి

ప్రతి ఆడబిడ్డ ఆనందంగా.. ప్రతి కుటుంబం సంతోషంగా బతుకమ్మ జరుపుకోవాలి
అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి: మంత్రి సీతక్క

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా, ఆనందంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, తాగునీరు,భద్రత తదితర అంశాలపైప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతితో దానికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో తెలంగాణ బిడ్డలు బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం గర్వకారణమని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సందర్భంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని, పూలను, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కలిపి జరుపుకునే ప్రత్యేకమైన పండుగ అని పేర్కొన్నారు. "బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. మన సంస్కృతి, మన సంప్రదాయం, మన ప్రకృతితో ముడిపడిన పండుగ. ప్రతి ఆడబిడ్డ ఆనందంగా.. ప్రతి కుటుంబం సంతోషంగా.. ప్రతి గ్రామం సురక్షితంగా బతుకమ్మ జరుపుకునేలా ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది" అని మంత్రి సీతక్క తెలిపారు.బతుకమ్మ పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా పంచాయతీ అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో పనిచేసి పండుగకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. గ్రామాలు, బతుకమ్మ ఆడే ప్రదేశాలు, చెరువులు, కుంటలు, ఘాట్‌ల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బతుకమ్మ ఆడే ఘాట్‌లకు వెళ్లే మార్గాలను పూర్తిగా శుభ్రం చేయాలని, రహదారులపై గుంతలు ఉంటే వెంటనే పూడ్చాలని సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు ఉండేలా అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఘాట్‌ల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉంటే తొలగించాలని ఆదేశించారు. బతుకమ్మ వేదికలను ముందుగానే శుభ్రం చేసి సిద్ధం చేయాలని, అవసరమైన చోట్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బతుకమ్మ ఘాట్‌లకు సరైన రహదారి సౌకర్యం లేని ప్రాంతాల్లో వీబీజీ రామ్ జీ పథకం కింద మట్టి రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బతు కమ్మ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు పాల్గొంటారని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట్ల మెట్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు.ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిధుల కొరత కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతి చాటుతున్న బతుకమ్మ..

తెలంగాణలో పుట్టిన బతుకమ్మ పండుగ నేడు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోం దని మంత్రి సీతక్క అన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, మధ్యప్రాచ్యం, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో తెలంగాణ ప్రజలు బతుకమ్మను జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు."ఎక్కడ ఉన్నా తెలంగాణ బిడ్డల గుండెల్లో బతుకమ్మ ఉంటుంది. పూలను పేర్చి బతుకమ్మను నిలబెట్టినట్టే.. మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తరతరాలకు నిలబెట్టుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఆడబిడ్డలం తా ఐక్యంగా, ఆనందంగా బతుకమ్మను జరుపుకోవాలి" అని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.తెలంగాణ పూల పండుగ బతు కమ్మ ప్రతి ఇంటా ఆనందాన్ని,ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, ప్రతి గ్రామంలో ఐక్యతను నింపాలని మంత్రి సీతక్క ఆకాంక్షిస్తూ.. రాష్ట్రంలోని మహిళలందరికీ ముందస్తు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కారుచౌకగా కట్టబెట్టారు

తప్పుడు మాస్టర్ ప్లాన్ తో గజం రూ. 1,64,000 కే.. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొల్లగొట్టిన వైనం
ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిన అధికారులు. దాదాపు రూ. 60 కోట్లు ఖజానాకు గండి
అధికారులకు కోట్లల్లో ముడుపులు!

విశ్వంభర, ఎల్.బి.నగర్: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా అధికారులు కారు చౌకగా ఆన్లైన్లో బిడ్డింగ్ లో పాల్గొన్న సంస్థకు కట్టబెట్టారు. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతుంది. వివరాల్లోకి వెళ్తే రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ మండలంలోని సర్వే నెంబర్ 9/1 పి లో గల పాత రంగారెడ్డి కోర్టు స్థలం (4356 చదరపు గజాలు). హెచ్ఎండీఏ అధికారులు కావాలనే తప్పుడు మాస్టర్ ప్లాన్ చూపించి, కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కారుచౌకగా ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టారనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి.

అసలేం జరిగింది? గత సెప్టెంబర్ నెలలో హెచ్ఎండీఏ ఈ స్థలాన్ని ఆన్ లైన్ ద్వారా వేలం వేసింది. చదరపు గజానికి రూ. 1.50 లక్షలుగా కనీస ధర నిర్ణయించగా, వేలంలో చదరపు గజానికి రూ. 1.64 లక్షలకు బిడ్డింగ్ నమోదైంది. ఈ లెక్కన హెచ్ఎండీఏకు రూ. 71.44 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే ఇక్కడే అసలు మతలబు దాగి ఉంది.

100 అడుగుల రోడ్డును 80 అడుగులుగా..

నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిని విక్రయించే ముందు దానికి సంబంధించిన సమగ్ర వివరాలు కొనుగోలుదారుల ముందు ఉంచాలి. ఈ స్థలానికి ఉత్తరాన ఇన్నర్ రింగ్ రోడ్డు, తూర్పు వైపు సరూర్ నగర్ రోడ్డు ఉన్నాయి. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ - 2031 ప్రకారం సరూర్ నగర్ వైపు రోడ్డు 100 అడుగులుగా ఉంది. కానీ వేలం కోసం విడుదల చేసిన డాక్యుమెంట్లలో మాత్రం దానిని 80 అడుగులుగా చూపించారు.మాస్టర్ ప్లాన్ తయారు చేసిన సంస్థ ఈ విషయాన్ని విస్మరించడం అధికారుల నిర్లక్ష్యమా? లేక లంచాలకు అలవాటుపడి కావాలనే ఈ విధంగా చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఖజానాకు రూ. 60 కోట్ల గండి..

ఈ స్థలం ఉన్న ప్రాంతం వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. ఇక్కడ ప్రస్తుత మార్కెట్ విలువ గజం రూ. 3 లక్షల వరకు పలుకుతోంది. కానీ 100 అడుగుల రోడ్డును 80 అడుగులుగా చూపించడం వల్ల పోటీ తగ్గిందని, దీంతో గజం ధర భారీగా పడిపోయిందని రియల్టర్లు, స్థానికులు ఆరోపిస్తున్నారు. 80 అడుగుల రోడ్డు ఉన్నా గజం రూ. 3 లక్షలకు తక్కువ పలకదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ. 60 కోట్ల మేర గండి పడినట్లు అంచనా.

గురుకుల హాస్టల్ కు కేటాయించాలి: బాణాల ప్రవీణ్..

ఈ వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల ప్రవీణ్ స్పందించారు. సరూర్ నగర్ లోని పాత రంగారెడ్డి కోర్టు స్థలాన్ని చెరుకుతోట కాలనీలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆ గురుకుల పాఠశాలకు ప్రతి నెలా లక్షల్లో అద్దె చెల్లిస్తున్నారని, ఆ అద్దె డబ్బులతోనే ఇక్కడ శాశ్వత భవన నిర్మాణం పూర్తవుతుందని అన్నారు.నగరం నడిబొడ్డున గజం రూ. 3 లక్షలు పలికే భూమిని సగం ధరకే విక్రయించడం తగదని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేసి హెచ్ఎండీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం..

ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ
లోక్‌భవన్ ముట్టడి..నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

విశ్వంభర, హైదరాబాద్:దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చేపడుతున్న పోరాటానికి ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ఒక దేశ పౌరులు గా తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొంటున్న అనుమానాలకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన లోక్‌భవన్ ముట్టడి--నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలతో కలిసి లోక్‌భవన్ వైపు నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలిపారు.

ఎన్నికల వ్యవస్థపై అనుమానాలకు సమాధానం చెప్పాలి..

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని మంత్రి అడ్లూరి అభివర్ణించారు.. ప్రజల ఓటు హక్కుకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకమని చెప్పారు. ఓటర్ల జాబితాల సవరణ, ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు నమ్మకం ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యవసరమని, ఆ నమ్మకానికి ఎలాంటి విఘాతం కలగకుండా వ్యవహరించాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉందని తెలిపారు.ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై కఠిన చర్యలకు దిగడం సరికాదని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల తరపున ప్రశ్నలు లేవనెత్తు తు న్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితర నాయకులపై పోలీసులు , కేంద్ర ప్రభుత్వ తీరు పట్ల ఆయన మండిపడ్డారుప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై వివరణ కోరడం ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ఉన్న హక్కు అని అన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజల్లో ఉన్న అనుమానాలను మరింత పెంచినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఓటు హక్కుపై రాజీ లేదు..

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు తమ ఓటుతో ప్రభుత్వాలను ఎన్నుకునే హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదన్నారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య సంస్థలు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేస్తున్నాయనే విశ్వాసం ప్రజల్లో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు.రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, దేశంలోని ప్రతి పౌరుడి హక్కులకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇండియా కూటమి పార్టీలతో కలిసి కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజల ఓటు విలువను కాపాడే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు అవసరమైన ప్రతి ప్రజాస్వామ్య మార్గంలో పోరాటాన్ని కొనసాగిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు

ప్రముఖ నటుడు నానా పటేకర్ కన్నుమూత

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ప్రముఖ సినీ నటుడు నానా పటేకర్ (75) గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు . గోవాలోని తన నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను గమనించిన కుటుంబ సభ్యులు, వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే నానా పటేకర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా ఆయన మరణించినట్లు తెలిపారు. నటుడిని కాపాడేందుకు సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. పటేకర్ మృతిపై పోలీసులు మెడికో లీగల్ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు తెలియనున్నాయని పోలీసులు వెల్లడించారు.నానా పటేకర్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచతమే. ఆయన నటించిన కొన్ని సినిమాలు తెలుగులోకి డబ్ అయ్యి ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రజనీకాంత్ హీరోగా వచ్చిన 'కాలా' సినిమాలో విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే, తమిళంలో భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన 'బొమ్మలాట్టమ్' సినిమా తెలుగులో 'రాణా' పేరుతో డబ్ అయ్యింది. ఇందులో అర్జున్, కాజల్ అగర్వాల్‌తో పాటు నానా పటేకర్ ముఖ్య పాత్ర పోషించారు. 1951లో జన్మించిన నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 1978లో 'గమన్' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. తన కెరీర్‌లో మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకున్నారు. 'క్రాంతి వీర్' సినిమాకు ఉత్తమ నటుడిగా, పరిందా, అగ్నిసాక్షి చిత్రాలకు ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు దక్కింది. సినీ పరిశ్రమకు అందించిన సేవలకు గానూ 2013లో కేంద్రం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. అదే ఏడాది మహారాష్ట్ర ప్రభుత్వం రాజ్‌కపూర్ ప్రత్యేక సహకార అవార్డును ప్రదానం చేసింది. నానాపటేకర్ 1978లో మరాఠీ సినీ నటి, నిర్మాత నీలకంఠిని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా.. ఒక అబ్బాయి పుట్టిన రెండు సంవత్సరాలకే అనారోగ్య కారణాలతో కన్నుమూశాడు. మరో అబ్బాయి మల్హార్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అతనికి నటనపైనా ఆసక్తి ఉంది.